# కొత్తసైకిల్

-ఆకుండి సాయిరామ్

నేనుంటున్న గదికి కాస్త దూరంలో వున్న ఫ్యాక్టరీ వేసిన సైరన్‌కి ఉలిక్కిపడి లేచాను అప్పుడే తూరుపు తెలవారుతోంది కాకులు గోలగా అరుస్తున్నాయి! – బహుశా ఐదున్నరయి వుంటుంది! –

తలతిప్పి గదిలో ఓ మూల వున్న సైకిల్‌కేసి చూశాను కొత్త సైకిల్! నిన్ననే కొన్నాను! – దాన్ని చూసిన నా కళ్ళు ఆనందంతో తడి అయ్యాయి - తృప్తితో నా కడుపు నిండింది! – నా ఒళ్ళు పులకరించింది! –

పక్కమీంచి లేచి సైకిల్ దగ్గరకెళ్ళి ఆప్యాయంగా స్పృశించాను! –

వెంటనే తత్ కర్తవ్యం గుర్తొచ్చి గబగబా బొంత మడతపెట్టి ఓ మూలనున్న పెట్టిపై నుంచాను! – గూటిలోనున్న పందుంపుల్ల నోట్లో పెట్టుకొని, తువ్వాలు భుజంపై వేసుకొని గది తలుపులు దగ్గరగావేసి కాస్త దూరంలో వున్న నూతి దగ్గరకు నడిచాను! –

అరగంటలో కాలకృత్యాలు తీర్చుకున్నా! – నాకున్న మూడు జతల బట్టల్లో కాస్త బాగున్నది వేసుకున్నాను

వినాయకుడి కేలండరుకు అగరొత్తొకటి వెలిగించి నమస్కరించాను! –

సైకిల్ నొకసారి ఆప్యాయంగా చూసి దాని స్టాండును సున్నితంగా వెనక్కితోసి బయటకు తీసుకొచ్చాను

ముందురోజే రకరకాల రంగు కాగితాలు అంటించడంతో నా కంటికి ఎంతో సుందరంగా కన్పిస్తోందది!–

ముందురోజే సుబ్బయ్యశెట్టి కొట్లో అరువుకి తీసుకున్న రెండు కొబ్బరి కాయల్లో ఒకదాన్ని సైకిల్ కారేజికి తగిల్చి రెండో కొబ్బరికాయను సైకిల్ ముందుకెళ్ళి నెలకేసి కొట్టాను ముక్కలు ముక్కలుగా విరిగిందది!–

హేండిల్‌బార్‌ను రెండు చేతుల్తో పట్టుకున్నాను పెడల్‌పై కాలువేశాను మరుక్షణం రివ్వున దూసుకుపోసాగింది!–

పైడిమాంబ గుడి రాగానే సైకిల్ స్టాండువేసి కేరేజీకున్న కొబ్బరికాయను తీసికొని గుడిలోని కడుగేశాను. ఐదు నిముషాల్లో ప్రసాధంతో బయట పడ్డాను!....

అప్పటికి ఆరుంపావయ్యింటుంది!–

న్యూస్ ఏజెంట్ అప్పలరాజు దగ్గరకెళ్ళి ఆ రోజు దినపత్రికలు అతన్దగ్గర తీసుకొని సైకిల్ కారేజీకి తగిలించాను!–

అప్పుడు మొదలయ్యింది నా డ్యూటీ!–

ఏడుగంటలకల్లా పేపర్ను పంచడం పూర్తయ్యింది ఇంకా ఒక్క ఇంగ్లీషు పేపరు మాత్రం వుంది! అది రంగారావుగారిది!–

సైకిల్‌ను స్పీడుగా తొక్కుకుంటూ వెళ్ళి రంగారావుగారి ఇంటి ముందాపాను!– కేరేజీకి వున్న పేపరు తీసి ఇంట్లోని కడుగేశాను!–

నమస్తే సార్!

"రావోయ్ రాము! నీ పేపర్ కోసమే చూస్తున్నా ' అన్నారు సోఫాలో కూర్చుంటూ!–

పేపరు ఆయన కందించాను!–

"పేపర్‌బోయ్ ' అంటూ చెంగున వచ్చింది పాప, ఇవాళ కొత్త సైకిల్ తీసుకొచ్చావా! ఏదీ!

అంటూ బయటికొచ్చింది

హాయ్! ఎంత బాగుందో బాగా డెకరేట్ చేశావు రాము! అంటూ నావేపు మెచ్చుకోలుగా చూసింది నా హృది ఆనందంతో ఉప్పొంగింది! చిర్నవ్వు నవ్వాను

పుస్తకాల సంచిని 'హేండిల్‌బార్‌కు తగిల్చి, ఉండు! ఇప్పుడే వస్తా! అంటూ ఇంట్లోనికి పరుగెత్తింది!–

ఎందుకెళ్ళింది చెప్మా అనుకుంటూండగానే రివ్వున వచ్చింది పాప చేతిలో రంగు కాగితాలతో చేసిన పెద్దపువ్వు!– ఆ పువ్వును హేండిల్‌బార్ మద్యలో అమర్చింది!–

అబ్బ! ఎంత బాగుందో సైకిల్ కదూ! అంటూ నావేపు చూసి నవ్వింది!–

ఆ చిన్నారి పాప చిర్నవ్వు నా గుండెల్లో ఆనందాన్ని రేపింది! అసలు ఆ ఆరేళ్ళ పసిపాప సహాయంతో నే నేనో సైకిల్ కొనగలిగేను!

ఉద్వేగంతో ఆ పాప బుగ్గలు చిదిమాను!–

'పేపరుబోయ్! టైం అయిపోయింది త్వరగా పద! అంటూ బేబీ సీట్‌పై కూర్చుంది!–

రంగారావుగారి దగ్గర సెలవు తీసుకొని సైకిలెక్కాను!– గతం నా మదిలో మెదలసాగింది!– నా మనసు పరధ్యానంగా వున్నా నా చేతులూ, కళ్ళూ సైకిల్ నడపడంలో అప్రమత్తంగా వున్నాయి!–

★ ★ ★

ఇక్కడకి వంద కిలోమీటర్ల దూరాన వున్న 'మక్కువ' అనే పల్లెటూరు నా జన్మస్థలం!– నా తల్లిదండ్రులకు నేనొక్కణ్నే సంతానం దిన వారీ కూలీగా పనిచేసే నా తండ్రి సంపాదన ఒక్కపూట తినడానికే మాకు చాలేదికాదు!.. ఎలాగోలా ఎనిమిదో తరగతివరకూ చదివిన నన్ను ఇంక చదివించలేకపోయాడు నా తండ్రి!.. ఐదేళ్ళపాటు ఖాళీగా మా వూళ్ళోనే తిరిగాను!....

ఎలాగైనా బ్రతుకు తెరువు చూసుకోవాలన్న తలంపుతో ఈ విశాఖపట్నం వచ్చిచేరాను!– ఎటు చూసినా అయోమయంగా, అట్టహాసంగా వుండే ఈ విశాఖలో నాకు కనీసం కూలిపనైనా దొరికే అవకాశం లేకపోవడంతో నిరాశగా వెనక్కి వెళ్ళిపోదామనుకుంటున్నంతలో ఆపదలో ఆపద్బాంధవుడిలా కన్పించాడా పేపరుబోయ్!–

నిరాశగా పోతున్న నన్ను యధాలాపంగా పలకరించిన ఆ పేపరుబోయ్ సొంతవూరు మా వూరి ప్రక్కనే వున్న సాలూరు కావడంతో అతడు నన్ను మర్రిపాలెంలో తనుంటున్న గదికి తీసుకెళ్ళాడు!–

నేను చెప్పిందంతా విన్నాడు అతని వివరాలు తెల్సుకున్నా అతని పేరు చంద్రంట!–

నేను చెప్పింది విన్నాక అన్నాడు – నాకు ఇక్కడే బీటీ ఐస్ ఫ్యాక్టరీలో ఉద్యోగం దొరికింది అంచేత ఈ పేపరు బోయ్ పని మానేద్దామనుకుంటున్నాను న్యూస్ ఏజెంట్ అప్పలరాజుతో చెప్పి నీకి పనప్పిస్తాను చేస్తావా!

నా చెవులను నేనే నమ్మలేకపోయాను కలా నిజమా అనుకున్నాను చంద్రం నాకు దేవుడిలా అగుపించాడు!– నా గుండె ఆనందంతో ఉప్పొంగింది!–

కాని ' సొంత సైకిలొకటుంటేగానీ అప్పలరాజు ఈ పని ఇవ్వడు!– ఎందుకంటే చాలా దూరం వరకూ - చాలా ఎక్కువ పేపర్లు పంచాలి సైకిలు లేకపోతే కష్టం అన్నాడు చంద్రం!–

నా ఉత్సాహమంతా నీరుగారిపోయింది! మళ్ళీ నిరాశా, నిస్పృహలలో మునిగిపోయాను

వాడిపోయిన నా మొహాన్ని చూసి పోనీ! ఇప్పుడు నేను బీటీ ఐస్ పాక్టరీలో చెయ్యబోయే ఉద్యోగానికి సైకిల్ అవసరంలేదు అంచేత నువ్వు నా సైకిల్‌ని వాడుకో అన్నాడు

చంద్రం నా కళ్ళకు దేవుణ్ణి మించిన వాడిగా కన్పించాడు!–

చంద్రంతోనే కలసి ఉండసాగేను వారంరోజుల్లో చంద్రం బీటీ ఐస్ ఫ్యాక్టరీలో జాయిన్ అయిపోయాడు!–నేను పేపర్‌బోయ్‌గా అప్పలరాజు దగ్గర కుదిరాను

రోజూ ఉదయాన్నే ఆరుగంటలకల్లా అప్పలరాజు దగ్గర పేపర్లు తీసుకొని పంచడం మొదలెట్టాలి!– గోపాలపట్నంలో వుండే సూపర్‌వైజర్ రంగారావు-

గారిది చివరి ఇల్లు!- ఆయన ఇంగ్లీషు పేపరు తీసుకుంటారు!-

రంగారావుగారు చాలా మంచాయన! సాదరంగా మాట్లాడతారు ఆయనకో చిన్నారి ఆరేళ్ల కూతురుంది అ పాప పేరు వసంత!- పుత్తడి బొమ్మలా వుంటుంది!- నేను వారింటి కెళ్లగానే ఆ పాపే పేపరందుకొని వాళ్ల నాన్నగారి కందిస్తుంది!-

చక్రాల్లాంటి కళ్లను త్రిప్పుతూ ఎన్నెన్నో కబుర్లు చెబుతుంది పేపర్‌బోయ్ అంటూ ముద్దు ముద్దుగా నన్ను పిలుస్తుంది!-

పేపర్లు పంచడంలో అదే చివరిల్లు కావడంతో అక్కడో పావుగంటసేపు పాపతో ఊసులాడి తిరిగి వచ్చేస్తుంటాను!-

ఆ రోజు పేపరివ్వడానికి వెళ్లగానే రంగారావుగారు చెప్పారు, పాప కాలికి దెబ్బ తగిలిందట!- స్కూలి కెళ్లడాన్కి సిటీ బస్సెక్కుతూండగా జారిపడిపోవడంతో కాలు రాసుకు పోయిందట!-

నాకెంతో బాధ వేసింది!-

కాసేపు మౌనంగా వున్నాక నోరు పెగిల్చి ఆయనతో ఇలా అన్నాను సార్!- నేను రోజూ పంచే పేపర్లలో మీదే చివరిది- నేను ఎలాగూ వెనక్కి తిరిగి వెళ్లిపోవాలి!- పాప స్కూలు ఆ రూటులోనే కాబట్టి రోజూ నేను పాపను స్కూలుకి నా సైకిలుపై డ్రాప్ చేస్తాను సాయంత్రం కూడా ఇంటికి దిగబెట్టేస్తాను!-

కాసేపు ఆలోచించేక ఆయన సరేనన్నారు!-

ఆ రోజెంతో ఆనందించాను!- ఆ మర్నాటినుంచీ పాపను ఇండష్ట్రియల్ ఎష్టేటు దగ్గరున్న స్కూలికి దిగబెట్టే బాధ్యత నేను తీసుకున్నాను!-

నెలరోజులు గడిచాయి-పాపకీ నాకూ మధ్య స్నేహం బాగా పెరిగింది!- స్కూలికి చేరేంతవరకూ ఏవేవో కబుర్లు చెబుతూనే వుంటుంది!- పేపర్లు 'పంచడంకన్నా పాపను స్కూలికి దిగబెట్టడంలోనే నాకు ఎక్కువ ఆనందం వుంటోంది!-

ఓ రోజు హటాత్తుగా చంద్రం అన్నాడు ఓరేయ్! రాముా!- ఈ రోజు మా నాన్న దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది!- నాకు సాలూరులోనే ఓ ఉద్యోగం చూశాట్ట వెంటనే వచ్చెయ్యమన్నాడు ఉద్యోగం వివరాలు కూడా రాశాడు! అంటూ ఉత్తరం చూపెట్టాడు!-

నా గుండెల్లో రాయిపడింది చంద్రానికి సాలూరులో దొరికిన ఉద్యోగానికి సైకిల్ కూడా అవసరమేనని వాళ్లనాన్న ఉత్తరంలో వ్రాశాడు

సైకిల్ లేకపోతే నా ఉద్యోగం పోతుంది భవిష్యత్తు నాకు అంధకారంగా కన్పించింది!-

చంద్రం నావేపు చూడకుండానే అన్నాడు ఎల్లుండి సాయంత్రం వెళ్లిపోతాను

సైకిల్ లేకపోతే ఉద్యోగం పోవడమేకాదు పాపని రోజూ స్కూలుకీ, ఇంటికీ తీసుకెళ్లే అదృష్టపు అవకాశాన్ని కూడా కోల్పోతాను మనసంతా వ్యధతో నిండింది!- ఆ రోజు రాత్రి నిద్రపట్టలేదు!

మర్నాడు ఉదయం స్కూలుకి తీసుకెళుతున్నప్పుడు పాప నాతో అంది, ఏం పేపరుబోయ్! అలా ఉన్నావ్ ఒంట్లో బాగులేదా!?

పాపతో చెప్పాను రేపటితో నా ఉద్యోగం పోతుంది ఎల్లుండినుంచి ఏం చేయాలో

పాప ముఖం కూడా మ్లానమయినట్లు గ్రహించాను!-


స్కూలుకి పోతున్నంతసేపూ ఏవేవో మాట్లాడే పాప మరి మాట్లాడలేదు

ముడుచుకుపోయిన పాపముఖం చూసి బాధపడ్డాను!- మరోసైకిల్ కొనాలంటే డబ్బులేదు నా దగ్గర ఒక్క వంద రూపాయలు మాత్రమే వుంది ఆ డబ్బుకి సైకిల్ రాదు ఆలోచనలతో మెదడు మొద్దుబారి పోయింది!-

ఈ రోజు ఈ ఉద్యోగంలో చివరిరోజు అనుకుంటూ ఆ రోజు పేపర్లు పంచుతూ రంగారావు గారింటికి చేరాను!-

పేపర్‌బోయ్ వచ్చేశావా! అంటూ పాప ఇంట్లోకి పరుగెత్తి అరనిముషంలో తిరిగొచ్చింది పాప చేతిలో చిన్న పిల్లలు డబ్బులు వేసుకొనే కిడ్డీ బ్యాంక్ బొమ్మ వుంది!-

"డాడీ రోజూ ఇచ్చే డబ్బులు ఇందులో దాచేను....-



ఇప్పటకి మూడు వందల రూపాయలయ్యాయి ఈ డబ్బులతో నువ్వు సైకిల్ కొనుక్కో ఏం! అంటూ కిడ్డీ బ్యాంకులోని డబ్బులు తీసి అందుకొమ్మన్నట్లుగా నాకోసి చాచింది!-

అమాయకంగా వున్న పాప ముఖంకేసి నవ్వుతూ చూశానే తప్ప అందుకోలేదు

చూడు డాడీ! పేపరుబోయ్ డబ్బులు తీసుకోవట్లేడు ఫిర్యాదు చేస్తున్నట్లుగా వాళ్ల నాన్నగారితో అంది పాప!-

తీసుకోవయ్యా రాముా! అన్నారు రంగారావుగారు పేపరులోంచి తల ఎత్తకుండానే!-

సార్! అన్నాను విస్మయంగా!-

అవునయ్యా!- పాప చెప్పినట్లు విను అన్నారు నవ్వుతూ!

ఆశ్చర్యం ఆనందం, కృతజ్ఞత నిండిన కళ్లతో పాపకేసిచూశాను

పాప డబ్బును నాచేతిలో పెట్టింది!- ఒక్క ఉదుటన పాపను ఎత్తుకొని ముద్దులాడాను!-

కృతజ్ఞత వ్యక్త పరచడానికి నా నోట మాటరాలేదు ఆనందం గొంతుకి అడ్డుపడింది!-

* * *

బుచ్చిరాజుపాలెం ఎన్ ఎ డి కొత్తరోడ్ మర్రిపాలెందాటి పాప స్కూలును చేరుకుంది నా సైకిల్!

నెమ్మదిగా పాపను దింపాను!-

"అన్నట్టు....పాపా!.... మరచిపోయాను.... దేవుడి ప్రసాదం...." అంటూ జేబులోంచి కొబ్బరి ముక్క తీసి పాపకిచ్చాను.

కొబ్బరి ముక్క తింటూ ఓ చేత్తో టా టా చెప్తూ స్కూలులోని కెళుతున్న పాపను చూస్తున్న నా కళ్లు ఆనందంతో తడి అయ్యాయి!- □